పనుల పరిశీలన



నాలా పనులు పరిశీలిస్తున్న పవన్‌కుమార్

లింగోజిగూడ: నాలాలలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టి వర్షపు నీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని న్యూ నాగోలులో చేపట్టిన నాలాల మరమ్మతుల పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మాతృనాయక్, నాయకులు రవీందర్, తోట మహేందర్ పాల్గొన్నారు.

ఉప్పల ఫౌండేషన్ చేయూత



పుస్తే మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

లింగోజిగూడ: ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చేయూతనిస్తున్నామని రాబోయే కాలంలో మరింత మందికి సహాయ సహకారాలు అందజేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. నాగోలుకు చెందిన సుమలత వివాహానికి బుధవారం ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తే మెట్టెలు, చీర అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మలక్‌పేట: మలక్‌పేట ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల శాఖ నూతన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి హాజరై కమిటీ సభ్యులను ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆంజనేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రఘువీర్‌రెడ్డి, మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా శ్రీవాణి, కార్యదర్శి సతీష్, మహిళా విభాగం కార్యదర్శి శ్రీదేవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

మన్సూరాబాద్: బీజేపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం(నేడు) మధ్యాహ్నం నాగోలులోని రిలయన్స్ ఫ్రెష్ మాల్ వద్ద ప్రారంభమవుతుందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు హాజరవ్వాలన్నారు.

ఫర్నిచర్ కొనుగోలుకు రూ.15 లక్షలు విడుదల

చాదర్‌ఘాట్: జిల్లాలోని ప్రధాన హాస్పిటల్స్‌లో (ఏరియా హాస్పిటల్)లో ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. ఇందుకు గాను రూ. 15 లక్షలతో ఫర్నిచర్ కొనుగోలు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఫర్నిచర్ కొనుగోలు కోసం టెండర్లను ఆహ్వానించామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ క్లినిక్‌లను ప్రారంభిస్తామన్నారు.

సన్మానం



మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన శ్రీనివాస్

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. బుధవారం టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ కోసం శ్రమించే నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లభిస్తుందన్నారు.



హైడ్రా చూపు.. ఎప్పుడో ఇటు వైపు?

కబ్జా కోరల్లో సరూర్‌నగర్ చెరువు • నాడు 122.. నేడు 40 ఎకరాలు మాత్రమే..

సైదాబాద్: నగరంలోని చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తుంది. నగరవ్యాప్తంగా చెరువుల పరీవాహక ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధుల్లో దశాబ్దాలుగా వెలిసిన కట్టడాలను నేలమట్టం చేస్తూ ఆక్రమణదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. మల్లంపేట కత్వా చెరువు, సున్నం చెరువు తదితర చెరువుల వద్ద పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. నగరంలో హైడ్రా చర్యలు మొదలైనప్పటి నుంచి సరూర్‌నగర్ చెరువు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిర్మాణాలు చేసిన, చేస్తున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. స్థానికులు సైతం హైడ్రా అధికారులు సరూర్‌నగర్ చెరువు వైపు ఎప్పుడు వస్తారో అంటూ చర్చించుకుంటున్నారు.

నాడు తాగు, సాగునీటి కోసం..

16వ శతాబ్దంలో కులీకుతుబ్‌షా హయాం 1626లో సరూర్‌నగర్ సమీప ప్రాంతంలో సరూర్‌నగర్ చెరువును కట్టించారు. అప్పటి ఇక్కడి సమీప ప్రాంతవాసుల తాగునీటి, సాగునీటి అవసరాల నిమిత్తం మొత్తం 122 ఎకరాల్లో ఈ చెరువును నిర్మించారు. కాలక్రమేణా సరూర్‌నగర్ చెరువు పరిధి కుంచించుకుపోతూ వచ్చింది. కబ్జాకోరల్లో చిక్కుకున్న చెరువు ప్రస్తుత విస్తీర్ణం సుమారు 40 ఎకరాలు మాత్రమే.

మినీ ట్యాంక్‌బండ్‌గా ప్రసిద్ధి..

నగరంలోనే అత్యంత ప్రధాన పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్ లాగానే సరూర్‌నగర్ చెరువు వద్ద నిర్మించిన కట్ట మినీ ట్యాంక్‌బండ్‌గా పేరు గాంచింది. సరూర్‌నగర్ చెరువుకు ఒక వైపు ప్రజల రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మించిన కట్ట, మరో మూడువైపులు జనావాసాలతో ఉంది. చెరువుకు ఒకవైపు దశాబ్దంన్నర క్రితం అప్పటి ప్రభుత్వం ఇందిరా ప్రియదర్శిని పార్కును నిర్మించింది. అదే విధంగా చెరువు సుందరీకరణ పనుల పేరుతో నెక్లెస్ రోడ్ తరహా చెరువు చుట్టూ మట్టి కట్టను నిర్మిస్తున్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనాల సమయంలోనూ ట్యాంక్‌బండ్ తర్వాత సరూర్‌నగర్ చెరువు వద్దనే ఎక్కువ విగ్రహాలు నిమజ్జనం అవుతుంటాయి. సరూర్‌నగర్ చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణలపై హైడ్రా ఎప్పుడు కొరడా ఝులిపిస్తుందో అని నిత్యం స్థానికులు చర్చించుకుంటున్నారు. కొంత కాలం క్రితం చెరువుకు సంబంధించి ఉన్న స్థలంలో తమ కళ్ల ముందే నిర్మాణాలు చేసుకున్నారని, ఇక వారికి హైడ్రా చేతిలో గుణపాఠం తప్పదని ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

సరూర్‌నగర్ చెరువు పరీవాహక ప్రాంతంలో గత రెండు దశాబ్దాల కాలంలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలిసాయి. గత ప్రభుత్వ హయాంలో కబ్జాదారులు చెరువు స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేశారు. చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో ఇలా ఇష్టారాజ్యంగా నిర్మించిన కట్టడాల వివరాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తాం. సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధలోని అక్రమ నిర్మాణాలపై కూడా హైడ్రా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– నాగరిగారి దాస్, ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు

ఆక్రమణలతో ఇబ్బందులు..

సరూర్‌నగర్ చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడంతో పరిసర కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షపునీరు సాఫీగా చెరువులోకి వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఇళ్లలోకి చేరుతుంది. వర్షాలు కురిసిన ప్రతిసారీ చెరువు పరిసర కాలనీవాసులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. హైడ్రా అధికారులు సరూర్‌నగర్ చెరువు బఫర్‌జోన్‌లో నిర్మించిన బహుళ అంతస్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి.

– షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

సేవా కార్యక్రమాల ముసుగులో..

చెరువుకు మూడు వైపులా దశాబ్దాల క్రితమే ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్ధారించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు ఉన్నాయి. అయితే పలువురు అక్రమార్కులు పలుకుబడి, అధికారులతో కుమ్మక్కై ఎఫ్‌టీఎల్ సరిహద్దు రాళ్లను తొలగించి మరీ చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టారు. ముఖ్యంగా చెరువుకు ఆనుకొని ఉన్న ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్, సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, సింగరేణి కాలనీల్లో విచ్చలవిడిగా నిర్మాణాలు చేసుకున్నారు. చెరువు కట్టపై నిలబడి చూస్తే చెరువు లోపలికి వచ్చి కట్టినట్లు పలు నిర్మాణాలు కనబడుతాయి. సేవా కార్యక్రమాల ముసుగులో కూడా కొందరు బహుళ అంతస్తుల నిర్మాణం చేసి అందులో ఇష్టారాజ్యంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చెరువు సమీపంలోని శంకేశ్వరబజార్ కాలనీలో కొందరు అక్రమార్కులు భారీ వెంచర్ ఏర్పాటు చేయటానికి రంగం సిద్ధ చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కలుషిత జలాల సరఫరాపై ఫిర్యాదు చేయండి



శంకర్, జలమండలి ఏఈ

చాదర్‌ఘాట్: కలుషిత నీటి సరఫరాపై తమకు సమాచారం ఇవ్వాలని ఓల్డ్‌మలక్‌పేట జలమండలి ఏఈ శంకర్ సూచించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అదే విధంగా మూసీ వరద ప్రభావంతో పైపుల్లో మట్టిచేరి నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంటుదని కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా 7995660991నంబర్‌పై సమాచారం ఇవ్వాలన్నారు.

లైంగిక దాడి కేసులో డిఫెన్స్ ఉద్యోగికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో డీఆర్‌డీఓ ఉద్యోగికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ పి.మంజుల దేవి వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పరిధి ఉప్పర్‌పల్లిలో బాధిత యువతి(19) తన తల్లితో కలిసి నివసించేది. వీరికి డీఆర్‌డీఓ ఉద్యోగి రిషి శర్మ(50)తో మంచి పరిచయం ఉండడంతో తరచూ వారి ఇంటికి వెళ్లేవాడు. 2017లో యువతి తల్లి విహార యాత్రకు వెళ్లింది. విషయం తెలుసుకున్న రిషి శర్మ యువతి ఇంటికి వెళ్లి లైంగిక దాడికి పాల్పడి విషయం బయటకు తెలిస్తే చంపేస్తానని బెదిరించాడు. భయాందోళనకు గురైన యువతి ఎవ్వరికి చెప్పలేదు. రెండు నెలల తర్వాత యువతి గర్భం దాల్చడంతో తల్లికి విషయం చెప్పింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా విచారించిన 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి యం.వాణి బుధవారం నిందితుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం



మురుగు సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంలో సివరేజీ బోర్డు అధికారులు విఫలమవుతున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. డివిజన్ పరిధి బ్యాంక్‌కాలనీ, మల్లికార్జుననగర్‌కాలనీ, వివేకానందనగర్‌కాలనీలలో బుధవారం ఆయన పర్యటిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతలకుంట మల్లికార్జుననగర్ నుంచి హర్షటయోటా షోరూం వరకు సుమారు 30 కాలనీలకు పోయే ప్రధాన రహదారిలోని డ్రైనేజీ పొంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీల్లో మురుగు ఏరులై పారుతుండటంతో దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేటర్ వెంట యాదగిరి, నవీన్‌రెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

వరద కాలువ పనులు వేగవంతం చేయాలి



కాలువ పనులు పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలలో ఎస్ఎన్‌డీపీ నిధులతో ప్రారంభించిన వరద కాలువ పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన వంగ శంకరమ్మ గార్డెన్ నుంచి కర్మన్‌ఘాట్ వేంకటేశ్వర ఆసుపత్రి వరకు కొనసాగుతున్న కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మందమల్లమ్మ ఫంక్షన్‌హాల్ నుంచి సాగర్ రింగ్ రోడ్, ఎల్‌బీనగర్ చౌరస్తా, కామినేని హాస్పిటల్, నాగోల్ మీదుగా ప్రత్యేక నిధులతో వరదనీటి కాలువ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దీంతో డివిజన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలలో వరద ముంపు సమస్యకు చెక్ పడుతుందన్నారు. కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు కొంత మేర అసౌకర్యం కలుగుతుందని కాలనీ వాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్పొరేటర్ వెంట రవీందర్‌రెడ్డి, దశరథగౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, యాదయ్య, బలరాం, వీరారెడ్డి ఉన్నారు.

విస్తృతంగా సభ్యత్వాలు చేయించాలి



సభ్యత్వం అందజేస్తున్న చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: అన్నివర్గాలకు చేరువై పార్టీ సభ్యత్వం విస్తృతంగా చేయించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన మూసారంబాగ్‌లో మంగళవారం రాత్రి జరిగిన సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలువురికి సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రతి బూత్‌లోని ఇంటింటికి వెళ్లి సభ్యత్వం చేయించాలని సూచించారు. పార్టీ విధానాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భాగ్యనగర్ జిల్లాలో 3.50 లక్షల సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ, ఇన్‌చార్జి రామకృష్ణ, నాయకులు సుభాష్‌చందర్, నర్సింహా, రామారావు, కోటేశ్వర్‌రావు, వినోద్, హరిగౌడ్, లక్ష్మారెడ్డి, భరత్‌కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత రిమాండ్

లింగోజిగూడ: గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేందర్‌నగర్, వాడి ఈ మహమద్ నగర్‌లో నివాసముండే మహ్మద్ బషీర్ బుధవారం గంజాయి సరఫరా చేయడానికి ఎల్‌బీనగర్ వస్తుండగా అదే సమయంలో ఎన్‌టీఆర్‌నగర్ వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 18.03 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మలక్‌పేట: జీతాలు చెల్లించాలని మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది బుధవారం నిరసన తెలిపారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కాంట్రాక్టర్‌ను పలుమార్లు అడిగినా స్పందించడం లేదని ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

పూజలు వైభవం.. ఘనంగా నిమజ్జనం

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వినాయక ఉత్సవాలు, నిమజ్జనలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన గణపయ్యలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఐదో రోజు పలు ప్రాంతాల్లో నిమజ్జం చేశారు. సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జన సందడి నెలకొంది. బుధవారం సుమారు 200 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



మూసారంబాగ్‌లో గణపయ్యను దర్శించుకున్న సంరెడ్డి సురేందర్



త్రివేణినగర్‌లోని మండపంలో పూజల్లో పాల్గొన్న లక్ష్మణ్‌ఠాకూర్



సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద నిమజ్జనం చేస్తున్న భక్తులు





గణపయ్యను నిమజ్జనానికి తీసుకొస్తున్న బాలుడు



నాగోలు జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్‌లో..



వినాయక పూజలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ నర్సింహారెడ్డి



హైకోర్టుకాలనీలో గణపతి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి